సాక్షి ఫోకస్

సంపాదకీయం

# హక్కుల చుక్కాని

రాష్ట్రంలో 'పౌరహక్కులు' అనే మాట చెవినపడగానే గుర్తుకొచ్చే వ్యక్తి ఆయనే. హక్కుల ఉద్యమానికి తన జీవితాన్నే ఆయన చిరునామాగా చేసుకున్నారు. ఎక్కడ అసహాయుల హక్కులు బలవంతుల ఉక్కు పాదాల కింద అణగారిపోతున్నట్టు తెలిసినా అక్కడ వాలడం ఆయన తనకు తాను విధించుకున్న ప్రథమ కర్తవ్యం. నిజానిజాలు శోధించడం, హక్కుల హననానికి ఆనవాళ్లు కనిపించగానే ఆ సంగతి లోకానికి చాటింపు వేయడం, వీలైన ప్రతిమార్గంలో దానిపై పోరాటం చేయడం- ఇదే గత మూడు దశాబ్దాలుగా ఆయన ప్రధాన కార్యక్షేత్రం. ఆయనే డా॥ కె.బాలగోపాల్.

ఆరు పదుల వయసు కూడా నిండకుండానే బాలగోపాల్ హఠాన్మరణం చెందడం ఎవరూ ఊహించని, ఎవరికీ నమ్మశక్యంకాని దుర్వార్త. ఉద్యమంలో భాగంగా కాలికి బలపం కట్టుకుని ఆయన తిరగని ఊరులేదంటారు. హక్కులకు అండగా తను ఎలుగెత్తని చోటు లేదంటారు. అవిరామశ్రమకు, అవిశ్రాంత పోరుకు ఆయన ఇచ్చిన ప్రాముఖ్యం ఆరోగ్యానికి ఇచ్చినట్టు లేదు. బహుశా అందుకే ఈ బాధాకర అకాలమరణం. ఆయన మృతితో రాష్ట్రంలో హక్కుల ఉద్యమం పెద్దదిక్కు కోల్పోయింది.

పోరాటవాదేకాక అనవరత అధ్యయన శీలి కూడా అయిన బాలగోపాల్ తెలుగునాట గుర్తింపు పొందిన అగ్రశ్రేణి మేధావులలో ఒకరు. ఎంత సంక్లిష్టమైన అంశాన్ని అయినా సూటిగా, తేటగా వివరించి చెప్పగల రచయిత ఆయన. అలాగే లోతుల్ని తరచి చూసి మరుగుపడిన వాస్తవాలను వెలికిలాగి కొత్త కోణాలను, అన్వయాలను ఆవిష్కరించిన కలం ఆయనది. చివరివరకూ పత్రికలకు వ్యాసాలు రాస్తూనే ఉన్న బాలగోపాల్ తాను మంచిదని నమ్మిన ప్రతి అభిప్రాయాన్ని కుండ బద్దలుకొట్టినట్లు వెల్లడించడానికి ఎన్నడూ వెనుకాడని వ్యక్తి. తన అభిప్రాయాలకూ; తనతో భావసారూప్యమూ, మైత్రీ ఉన్న సంస్థలు, వ్యక్తుల అభిప్రాయాలకూ మధ్య తీవ్ర వైరుధ్యం తలెత్తిన అనుభవాలూ ఆయన ఎదుర్కొన్నారు. ఆ సందర్భాల్లో తాను ఏకాకి కాగల అవకాశమున్నా సరే, భావప్రకటనా స్వేచ్ఛను కాపాడుకోవడం వైపే మొగ్గు చూపించిన మేధో నిజాయితీ ఆయనది. హక్కుల నేతగా తనపై భౌతికంగా జరిగిన దాడులను ఎదుర్కొనడంలోనూ ఆయన అనితరమైన ధైర్యాన్ని ప్రదర్శించారు.

1981లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంస్థలో చేరి ఆ తర్వాత దానికి ప్రధాన కార్యదర్శిగా 1998 వరకు పనిచేసి హక్కుల ఉద్యమాన్ని ప్రాచుర్యంలోకి తేవడంలో ప్రధాన భూమిక పోషించిన బాలగోపాల్, ఎన్‌కౌంటర్లను ప్రశ్నిస్తూనే పోలీసులు-సాయుధ తీవ్రవాదుల ఘర్షణలో సామాన్య ప్రజల ప్రజాస్వామిక హక్కులకు కలుగుతున్న భంగాన్నీ ప్రశ్నించారు. ప్రజల జీవనహక్కుపై వేటు ఏవైపు నుంచి పడినా ప్రశ్నించవలసిందేనన్న వైఖరి తీవ్ర అభిప్రాయభేదాలకు దారితీయించడంతో ఆయన పౌరహక్కుల సంఘాన్ని వీడి 'మానవ హక్కుల వేదిక'ను ఏర్పాటు చేశారు.

సాయుధ పోరాటమార్గాన్ని ఎంచుకున్నవారు ప్రజల మధ్య జీవిస్తున్నప్పుడు యుద్ధాన్ని ఆహ్వానించే పనులు చేయకూడదని, మావోయిస్టులైనా రేపు అధికారానికి వస్తే రాజ్య సార్వభౌమత్వాన్ని సవాలు చేస్తే ఇంతకంటె భిన్నంగా నడుచుకోరని- పోలీసులు, నక్సల్స్‌కు మధ్య వర్తమాన సంకుల సమరం నేపథ్యంలో- నిన్నటికి నిన్న స్పష్టం చేయడానికి ఆయన సందేహించలేదు. ఆదివాసీలు, రైతుల హక్కుల పక్షాన నిలబడిన బాలగోపాల్ ప్రభుత్వాల పారిశ్రామిక అభివృద్ధి నమూనాలనే మూలమట్టంగా వ్యతిరేకించడం, దోపిడీకి, దౌర్జన్యానికీ ప్రతిరూపంగానే దానిని పరిగణించడం ఉద్యమ వాదుల్లో సహజంగా ఉండే అతివాద ధోరణికి కొంత అద్దంపడుతూ ఉండవచ్చు. కానీ, నోరులేని నిరుపేదల హక్కుల పరిరక్షణపట్ల ఆయన నిబద్ధత, నిమగ్నత ప్రశ్నించరానివి.

వేలు, వందల సంవత్సరాలు రాచరికపు చండశాసనాల కింద, భూస్వామ్యపు పడగనీడ కింద సాగిన మానవ చరిత్రలో మానవహక్కులు, పౌరహక్కుల భావనలు ఇప్పటి రూపంలో వికసించినది ఇటీవల. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, మానవహక్కులంటే మనిషిని మనిషిగా చూడడం, అతని అస్తిత్వానికి సంబంధించిన అన్ని హక్కులనూ గౌరవించడమే. ప్రజాస్వామిక సమాజాల్లో కూడా సర్వం తానేనని రాజ్యం విర్ర వీగి పౌరుల హక్కులను చెరబట్టబోయిన సందర్భాలు ఉంటూనే ఉంటాయి. దానిని నివారించే కాపలాదారు పాత్రను పోషించడానికే హక్కుల ఉద్యమాలు, భారత దేశంలో మానవహక్కులు, పౌరహక్కుల స్పృహ విస్తరిస్తూ వాటి పరిరక్షణ సంస్థాగత రూపం తీసుకుంటున్న దశలో రాష్ట్రంలో హక్కుల చుక్కానిగా బాలగోపాల్ నిర్వహించిన పాత్ర అసామాన్యం. ప్రత్యేకించి పేదల హక్కుల పోరాట చరిత్రలో ఆయన కృషి ఒక కీలకాధ్యాయం. ఆయనకు 'సాక్షి' అశ్రు నివాళి.